ప్రజాశక్తి
సోమవారం 23 డిసెంబర్ 2024 5 అనంతపురం

హైకోర్టు జడ్జిని కలిసిన ఇన్‌ఛార్జి కలెక్టర్

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

న్యాయవాదుల కార్యక్రమానికి హాజరవడానికి జిల్లా పర్యటనకు వచ్చిన హైకోర్ట్ జడ్జి జస్టిస్ కె.సురేష్ రెడ్డిని అనంతపురం ఇన్‌ఛార్జి కలెక్టర్ శివ నారాయణ శర్మ ఆదివారం కలిసి ఘన స్వాగతం పలికారు. స్థానిక రోడ్డు భవనాల శాఖ అతిథిగృహంలో జడ్జికి పూల మొక్కను అందజేసి స్వాగతం పలికారు.

జడ్జికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఇన్‌ఛార్జి కలెక్టర్

మహాసభలకు వేళాయె..

- నేడు, రేపు సిపిఎం జిల్లా మహాసభలు
- నగరంలో ర్యాలీ..భారీ బహిరంగసభ
- తోరణాలతో ఎరుపెక్కిన అనంత
- హాజరుకానున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

నగరంలోని ప్రధాన రహదారిలో సిపిఎం బైక్‌ర్యాలీ

ప్రజాశక్తి - అనంతపురం ప్రతినిధి

సిపిఎం అనంతపురం జిల్లా 14వ జిల్లా మహాసభలు సోమవారం అనంతపురం నగరంలో ప్రారంభం కానున్నాయి. 23, 24 తేదీల్లో జరిగే ఈ మహాసభలకు సిపిఎం పెద్దఎత్తున ఏర్పాట్లను చేపట్టింది. నగరంలోని గుత్తి రోడ్డులోనున్న ఎస్ఎన్ ఫంక్షన్ హాలులో ఈ మహాసభ జరుగనుంది. జిల్లాలో వివిధ ప్రాంతాల నుంచి సుమారు 230 మంది ప్రతినిధులు హాజరుకానున్నారు. ఈ మహాసభ ప్రారంభానికి ముందు బహిరంగ సభ జరుగనుంది. సోమవారం ఉదయం 10 : 30 గంటలకు నగరంలోని లలితకళా పరిషత్‌లో జరిగే ఈ బహిరంగ సభకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావుతోపాటు రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై. వెంకటేశ్వర్లు, ప్రభాకర్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరుకానున్నట్లు సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ తెలిపారు. అనంతరం మధ్యాహ్నం నుంచి గుత్తిరోడ్డులోని ఎస్ఎన్ ఫంక్షన్ హాలులో 14వ మహాసభ ప్రారంభం కానుంది.

మూడేళ్ల సమీక్షతోపాటు, భవిష్యత్ కార్యచరణ

13వ మహాసభ నుంచి ఇప్పటి వరకు మూడు సంవత్సరాల కాలంలో చేపట్టిన ఉద్యమాలు, పోరాటాలను సమీక్షించుకోనుంది. ఆ తరువాత రాబోయే మూడేళ్ల భవిష్యత్ కార్యచరణను రూపొందించనున్నారు. ఈ కాలంలో చేపట్టిన ఉద్యమాల్లో ప్రధానంగా రైతు,కూలి రక్షణ పేరుతో చేపట్టిన పాదయాత్ర, జీపు యాత్రలున్నాయి. వీటితోపాటు గుత్తి నుంచి అనంతపురం వరకు ఇళ్ల స్థలాల కోసం పాదయాత్ర, ఇల్లూరులో అటవీ భూముల రక్షణకు పాదయాత్రలు చేపట్టారు. అదే విధంగా ఉద్యోగ, కార్మిక సమస్యలపైనా అనేక పోరాటాలు సాగాయి. వీటన్నింటినీ సిపిఎం ఈ మహాసభల్లో సమీక్షించనుంది. వీటితోపాటు రాబోయే రోజుల్లో ప్రజా పునాదిని పెంపొందించుకోవడంపైనా దృష్టి సారించనున్నట్టు సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ తెలిపారు.

ఎరుపెక్కిన అనంత

అనంతపురం నగరంలో 11 సంవత్సరాల తరువాత మహాసభలు జరుగుతున్న నేపథ్యంలో అనంతపురం నగరంలో భారీ ఏర్పాట్లు చేపట్టారు. నగరంలోని అన్ని ప్రధాన కూడళ్లలోనూ ఎర్ర జెండాలతో ముస్తాబు చేశారు. ప్రధాన రహదారి వెంట సిపిఎం తోరణాలను కట్టారు. మహాసభ జరుగుతున్న ఎస్ఎన్ ఫంక్షన్ హాలును ప్రత్యేకంగా ముస్తాబు చేశారు.

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి రాంభూపాల్

బహిరంగ సభను జయప్రదం చేయండి : సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్

మహాసభల సందర్భంగా సోమవారం ఉదయం అనంతపురం నగరంలో జరిగే బహిరంగ సభలో సిపిఎం మద్దతుదారులతోపాటు, సానుభూతిపరులు అందరూ పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ పిలుపునిచ్చారు. ఆదివారం ఉదయం స్థానిక గణేనాయక్ భవనంలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రెండు రోజులపాటు జరుగుతున్న మహాసభలు సోమవారం ప్రారంభం కానున్నట్లు తెలిపారు. ఉదయం 10.30 గంటలకు ఆర్ట్సు కళాశల నుంచి బహిరంగ సభ జరిగే లలితకళాపరిషత్ వరకు ర్యాలీ ఉంటుందని చెప్పారు. అనంతరం జరిగే బహిరంగ సభలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వర్లు, ప్రభాకర్‌రెడ్డి హాజరవుతారని చెప్పారు. కావున ఈ సభలో సిపిఎం నాయకులతోపాటు, సానుభూతిపరులు అందరూ పాల్గొని జయప్రదంచేయాలని పిలుపునిచ్చారు. అనంతరం మధ్యాహ్నం నుంచి గుత్తిరోడ్డులోని ఎస్ఎన్ ఫంక్షన్‌హాలులో ప్రతినిధుల సభ ప్రారంభమవుతుందని చెప్పారు.

మహాసభలు జయప్రదం కోరుతూ స్కూటర్ ర్యాలీ

అనంతపురం నగరంలో 23, 24 తేదీల్లో నిర్వహిస్తున్న సిపిఎం 14వ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ సిపిఎం నగర కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం స్కూటర్ ర్యాలీ నిర్వహించారు. స్థానిక రైల్వే స్టేషన్ నుంచి స్కూటర్ ర్యాలీ ప్రారంభమై శ్రీకంఠం సర్కిల్, సప్తగిరి సర్కిల్, పాతూరు మీదుగా, ఆర్టీసీ బస్టాండ్ నుండి నీలిమ సర్కిల్ వరకు కొనసాగింది. ఈ సందర్భంగా పార్టీ నగర కార్యదర్శి వి.రామిరెడ్డి మాట్లాడుతూ సిపిఎం నియమావళి ప్రకారం మూడు సంవత్సరాలకు ఒక సారి నిర్వహించే సిపిఎం జిల్లా మహాసభలకు ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. సోమవారం స్థానిక ఆర్ట్స్ కాలేజ్ నుంచి ర్యాలీ నిర్వహిస్తామని, లలితకళా పరిషత్ నందు బహిరంగ సభ ఉంటుందని చెప్పారు. అనంతరం గుత్తి రోడ్డులోని ఎస్ఎస్ గ్రాండ్ ఫంక్షన్ హాల్‌లో ప్రతినిధుల సభ జరుగుతుందన్నారు. ఈ మహాసభలో గత మూడు సంవత్సరాలుగా సిపిఎం చేసిన ప్రజా ఉద్యమాలను సమీక్షించుకొని, భవిష్యత్తులో చేయాల్సిన పోరాటాలకు దిశ నిర్దేశం చేసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు నాగేంద్ర కుమార్, జిల్లా కమిటీ సభ్యులు ఆర్‌వి. నాయుడు, వెంకటనారాయణ, నగర కార్యదర్శి వర్గసభ్యులు గోపాల్, ముత్తుజా, ప్రకాష్, మసూద్,నగర కమిటీ సభ్యులు, ఓబిలేసు, ఏటీఎం నాగరాజు, బుల్లె రాజు, బాబా, లతీఫ్, గఫూర్, వెంకటనారాయణ, నగర నాయకులు నూరుల్లా, ఇస్మాయిల్, దాదు, ఫక్రు, వెంకట పాల్గొన్నారు.

ఆటో ర్యాలీ : అనంతపురం నగరంలో నిర్వహిస్తున్న సిపిఎం జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ భగత్‌సింగ్ ఆటో డ్రైవర్స్ యూనియన్ న్యూటౌన్ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం ఆటో ర్యాలీ నిర్వహిస్తున్నట్లు యూనియన్ నేతలు పాల్గొన్నారు.

కెఎస్ఆర్ కళాశాలలో

'ఆప్తాల్మిక్' కోర్సును కొనసాగించాలి

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిరసన

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

నగరంలోని కెఎస్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆప్తల్మిక్ టెక్నీషియన్ కోర్సును కొనసాగించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఓతూరు పరమేష్ డిమాండ్ చేశారు. ఆదివారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో సప్తగరి సర్కిల్ నుంచి అంబేద్కర్ విగ్రహం వరకూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కెఎస్ఆర్ బాలికల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రాష్ట్రంలోనే అత్యధిక మంది పేద మధ్యతరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థినులు చదువుతున్నారని తెలిపారు. ఇలాంటి సందర్భంలో ఇంటర్మీడియట్ బోర్డు మరికొన్ని టెక్నికల్, సైన్స్ కోర్సులు ఇవ్వాల్సిందిపోయి.. ఉన్నవాటిని తొలగించడం సరికాదన్నారు. ఇలా కోర్సులను తొలగిస్తూపోతే కళాశాల నిర్వీర్యమయ్యే ఆస్కారం ఉందన్నారు. ఒకేషనల్ సంబంధించి ఆప్తల్మిక్ టెక్నీషియన్ కోర్సును రద్దు చేయడం కోసం కళాశాలకు పదేపదే సర్కులర్లు జారీ చేస్తున్నారని తెలిపారు. ఆప్తల్మిక్ టెక్నీషియన్ కోర్స్ ఫస్ట్ ఇయర్ 45 మంది సెకండ్ ఇయర్ 45 మంది విద్యార్థినులు ఉన్నారని తెలిపారు. ఇప్పటికే ఈ గ్రూపులో వేలాది మంది విద్యార్థినులు చదువు పూర్తి చేసి ప్రభుత్వ, ప్రయివేట్ ఆసుపత్రులు, ఆప్టికల్స్ క్లినికల్‌లో ఉద్యోగాలు చేస్తున్నారని గుర్తు చేశారు. కావున ఇలాంటి సైన్స్, టెక్నికల్ కోర్స్‌ను కొనసాగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నగర నాయకులు సోము, విజయ్, సాయి, ధనుష్, రాకేష్, కార్తీక్, హేమలత, దివ్యకళ, దీపిక, మమతా తదితరులు పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు

సమాజాభివృద్ధికి తోడ్పడాలి

విప్ కాలవ శ్రీనివాసులు

ప్రజాశక్తి-రాయదుర్గంరూరల్

శిక్షణ తరగతుల్లో మెళకువలు నేర్చుకుని ఉద్యోగం సంపాధించి తమవంతుగా సమాజ అభివృద్ధికి తోడ్పడాలని విప్ కాలవ శ్రీనివాసులు అన్నారు. ఆదివారం మండల పరిధిలోని 74 ఉడేగోళం టెక్స్‌టైల్ పార్కులో డీఎస్సీ శిక్షణ అభ్యర్థులతో ముఖాముఖిగా మాట్లాడారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వెనుకబడ్డ ప్రాంతాలకు చెందిన అభ్యర్థుల కోసం రాయదుర్గంలో ఏర్పాటు చేసిన ఉచిత డీఎస్సీ శిక్షణ తరగతుల్లో అభ్యర్థులు నైపుణ్యత పెంచుకుంటారని ఆశాభావం వ్యక్తం చేశారు. పోటీ పరీక్షల్లో ప్రతిభ కనబరిచి ఉద్యోగాలు సాధించాలని ఆకాంక్షించారు. కుటుంబ పరిస్థితులు, ఆర్థిక ఇబ్బందులు, పెళ్లిళు ఇతరత్రా సమస్యలతో సుదూర ప్రాంతాలకు వెళ్లి శిక్షణ పొందలేని వారిని ప్రోత్సహించడం కోసం ఉచిత శిక్షణ తరగతులను ప్రారంభించామన్నారు. ఉద్యోగాల్లో స్థిరపడ్డాక సమాజంలో అవసరమైన వారికి, ఎటువంటి సహాయానికి నోచుకోలేని వారికి సాయం చేయాలన్నారు. అనంతరం శిక్షణ పూర్తి చేసుకున్న వారికి ఉత్తమ శ్రేణి మెటీరియల్ అందజేస్తామన్నారు.

కార్యక్రమంలో మాట్లాడుతున్న విప్ కాలవ శ్రీనివాసులు

పోలీస్‌స్టేషన్‌లో సిబ్బంది కొరత

విఆర్‌కు ఎస్ఐ, రైటర్, ఇద్దరు సిబ్బంది

ప్రజాశక్తి-యల్లనూరు

యల్లనూరు మండల పోలీసు స్టేషన్‌ను సిబ్బంది కొరత వేధిస్తోంది. మండలంలో 21 పంచాయతీల్లో 29 గ్రామాలు ఉన్నాయి. ఇందులో వెన్నపూసపల్లి, తిమ్మంపల్లి, మేడికుర్తి, గొడ్డుమర్రి, దంతలపల్లి లాంటి సమస్యాత్మ గ్రామాలూ ఉన్నాయి. ఇలాంటి గ్రామాల్లో గస్తీ కోసం ఒక్కో గ్రామానికి ఒక పోలీసును విధుల్లో ఉంచాలనుకున్నా కనీసం 9 మంది పోలీసులు ఉండాలి. పంచాయతీకి ఒకరి ప్రకారం అయితే 21 మంది ఉండాలి. కానీ యల్లనూరు పోలీస్ స్టేషన్‌లో ఇటీవల ఇక్కడ పని చేస్తున్న ఎస్ఐ, రైటర్, ఇద్దరు పోలీసులను ఉన్నతాధికారులు విఆర్‌కు పంపారు. డీఎస్పీ కార్యాలయనికి అటాచ్‌లో ఒకరు, సిక్ లీవ్‌లో ఒకరు, అవుట్ డ్యూటీలో ఒకరు, ట్రాఫిక్‌లో ఒకరు ఉన్నారు. సిబ్బంది చాలా తక్కువగా ఉండడంతో గ్రామాల్లో గస్తీ నిర్వహించడం కష్టంగా మారింది. వచ్చే జనవరిలో 18,19వ తేదీల్లో యల్లనూరులో పెద్ద ఎత్తున గ్రామ దేవత పెద్దమ్మ తల్లి జాతర జగరగనుంది. ఈ సమయంలో మండలంలో పూర్తి స్థాయి పోలీసు సిబ్బంది లేకుంటే అక్కడి పరిస్థితులను చక్కదిద్దడం కష్టమనే భావన ప్రజల్లో ఉంది. మండల పరిస్థితులను పోలీసు ఉన్నతాధికారులు గుర్తించి పూర్తి స్థాయిలో పోలీసు సిబ్బందిని నియమించాలని ప్రజలు కోరుతున్నారు.

తప్పులను సరిదిద్ది ఉద్యోగోన్నతులు ఇవ్వాలి

యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి లింగమయ్య

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ప్రభుత్వం ప్రకటించిన మున్సిపల్ ఉపాధ్యాయుల సీనియారిటీ జాబితాలో తప్పులను సవరించి మున్సిపల్ ఉపాధ్యాయుల పదోన్నతులు చేపట్టాలని యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గోవిందరాజులు, లింగమయ్య డిమాండ్ చేశారు. ఆదివారం యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో ఆఫీస్ బేరర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యాశాఖ అధికారులు తీసుకుంటున్న పాఠశాలల పనివేళలు పెంచాలనుకోవడం, ప్రశ్నపత్రాలను పోలీస్‌స్టేషన్లలో పెట్టమనడం వంటి అసంబద్ధ నిర్ణయాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పదవ తరగతి పరీక్షల పేరుతో వందరోజుల యాక్షన్ ప్లాన్‌లో సెలవు దినాల్లోనూ పండుగ దినాలను సైతం పని చేయాలని ఉత్తర్వులు ఇవ్వడంపై ఉపాధ్యాయులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. విద్యాశాఖ అసంబద్ధ నిర్ణయాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర కార్యదర్శి కోటేశ్వరప్ప మాట్లాడుతూ రాబోవు రోజులలో నైనా పరీక్ష ప్రశ్నాపత్రాలను పాఠశాలల పాయింట్‌కు చేర్చాలన్నారు. ప్రశ్నపత్రాలు పోలీస్ స్టేషన్ లోనూ మండల విద్యాశాఖ అధికారి కార్యాలయాల్లోనూ కాంప్లెక్స్ పాఠశాలల్లోనూ పెట్టి ఉపాధ్యాయులను, లేదా ప్రధానోపాధ్యాయులను ఉదయం మధ్యాహ్నం రెండు పూటలా ప్రశ్నపత్రాలను తీసుకెళ్లాలని చెప్పి బలవంతంగా ప్రయాణాలు చేయించడంతో తీవ్ర మానసిక ఒత్తిడికి గురవడమే కాకుండా ప్రయాణ మార్గమధ్యంలో జరిగే ప్రమాదాలకు గురవుతున్నారని తెలిపారు. అలాంటి నిర్ణయాలను వెంటనే రద్దుచేసి పాఠశాలల వద్దకే ప్రశ్నపత్రాలు సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షులు రమణయ్య, సహాధ్యక్షులు రామప్ప, సరళ, కోశాధికారి రాఘవేంద్ర, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు దేవేంద్రమ్మ, జిల్లా కార్యదర్శులు ప్రమీల, అర్జున్, అబ్దుల్‌వహాబ్, శేఖర్, రాముడు, సుబ్బరాయుడు, ఆడిట్ కమిటీ కన్వీనర్ చంద్రమోహన్, తదితరులు పాల్గొన్నారు.

విలేకరుతో మాట్లాడుతున్న యుటిఎఫ్ నాయకులు

మార్కెట్ యార్డు తనిఖీ

ప్రజాశక్తి-అనంతపురం రూరల్

నగరంలోని మార్కెట్ యార్డును ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ ఆదివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా పశువుల సంతకు తరలివచ్చిన వ్యాపారులు, పశువుల వ్యాపారులు, రైతులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మార్కెట్‌లో సౌకర్యాలు, సుంకం వసూళ్లపై ఆరాతీశారు. ఈ సందర్భంగా భోజన వసతి కల్పించాలని రైతులు విన్నవించారు. ఇందుకు ఎమ్మెల్యే స్పందిస్తూ త్వరలోనే భోజన వసతి ఏర్పాటు చేస్తామన్నారు. కాగా మార్కెట్‌లో నిర్దేశించిన మేరకు సుంకం వసూళ్లు చేయాలని సూచించారు. అలాగే మార్కెట్‌లో సౌకర్యాలు మెరుగు పరిచేందుకు కృషి చేస్తామని తెలిపారు.

సంతకు వచ్చిన పశువులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటి

పరీక్ష పేపర్లకు నిప్పు

ఘటనాస్థలాన్ని పరిశీలించిన ఎస్పీ

ప్రజాశక్తి - ఓబుళదేవరచెరువు

, స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలోని ఉపాధ్యాయుల గదిలోకి శనివారం రాత్రి గుర్తుతెలియని దుండగులు చొరబడి విద్యార్థుల పరీక్షల జవాబు పేపర్లకు నిప్పు పెట్టారు. గుర్తుతెలియని వ్యక్తులు శనివారం రాత్రి గది తలుపునకు ఉన్న తాళాన్ని పగలగొట్టి లోపలికి చొరపడ్డారు. విషయం తెలుసుకున్న ఎస్పీ రత్న ఆదివారం ఘటనాస్థలాన్ని పరిశీలించారు. అనంతరం ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడతూ గుర్తుతెలియని వ్యక్తులు తలుపు తాళాన్ని పగలగొట్టి లోపల బీరువాలోని ఎఫ్ఎ వన్, ఎఫ్ఎ టు విద్యార్థుల పరీక్షల జవాబు పత్రాలకు నిప్పు పెట్టారన్నారు. అయితే పాఠశాలకు సంబందించిన రికార్డులు భద్రంగా ఉన్నాయన్నారు. కేవలం విద్యార్థులకు సంబందించిన పరీక్ష జవాబు పత్రాలకు నిప్పుపెట్టడంతో అవి కాలి బూడిద అయ్యాయయన్నారు. క్లూస్‌టీం, డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు నిర్వహించామన్నారు. పాఠశాల హెచ్ఎం శోభారాణి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ మల్లిఖార్జున తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ వినోద్ కుమార్, క్రైమ్ బ్రాంచ్ సిఐ బాలసుబ్రమణ్యం రెడ్డి, ఎంఇఒ సురేష్, పోలీసులు పాల్గొన్నారు.

కాలిపోయిన పరీక్ష పేపర్లను పరిశీలిస్తున్న పోలీసులు

ఆదర్శపంచాయతీలుగా తీర్చిదిద్దుతాం

జిల్లా పంచాయతీ అధికారి సమత

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

శ్రీ సత్య సాయి జిల్లాలోని పంచాయతీలను అభివద్ధి పరచి వాటిని ఆదర్శ పంచాయతీలుగా తీర్చి దిద్దాలన్నదే తమ ధ్యేయమని, అందుకోసం అన్ని చర్యలు చేపడుతున్నామని శ్రీ సత్య సాయి జిల్లా పంచాయతీ అధికారి సమత పేర్కొన్నారు. ఈ మేరకు ఆమె ఆదివారం ప్రజాశక్తికి ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు విషయాలను వెల్లడించారు.

ప్రశ్న : పంచాయతీ అభివృద్ధికి ఇటీవల నిధులు మంజూరు చేశారు. వాటి ద్వారా ఏయే పనులు నిర్వహిస్తున్నారు.?

జవాబు : శ్రీ సత్య సాయి సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ప్రధాన ద్వారం నుంచి మామిళ్ళకుంట వరకు, ప్రశాంతి రైల్వే స్టేషన్ తదితర ప్రాంతాల్లో ప్రత్యేక పారిశుధ్య పనులు చేపట్టాం. రహదారుల వెంబడి పిచ్చి మొక్కలు, వ్యర్థాలను తొలగించి, తాగునీటి వసతి వంటి పనులను చేపట్టాం. జిల్లా వ్యాప్తంగా ఆయా పంచాయతీల్లో సిసి రోడ్ల నిర్మాణం సాగుతోంది. వచ్చిన నిధులకు సరిపడా సీసీ రోడ్లు, డ్రయినేజీ పనులు ముమ్మురంగా సాగుతున్నాయి.

ప్ర : సంపద సృష్టి కేంద్రాల నిర్వహణ ఏ విధంగా ఉంది.?

జ: జిల్లా వ్యాప్తంగా సాలిడ్ వేస్ట్ ప్రాసెసింగ్ సెంటర్లు 421 ఉన్నాయి. కార్మికులు గ్రామంలో సేకరించిన తడి చెత్త పొడి చెత్తను వేరు చేసి, వాటిలో వానపాములను వదిలి ఎరువుగా తయారు చేసి ఆ ఎరువును రైతులకు కిలో 40 రూపాయలు చొప్పున విక్రయించి దాని ద్వారా పంచాయతీకి ఆదాయం వచ్చే విధంగా చర్యలు చేపడతారు. పంచాయతీలలో ఇంటింటికి తిరిగి చెత్తను సేకరించడం, వీధులను శుభ్రం చేయడం వలన, పంచాయతీ పరిశుభ్రంగా ఉండటమే కాక , చెత్త ద్వారా సేకరించిన ప్లాస్టిక్ బాటిల్ ,ఇనుము ముక్కలు, సిల్వర్ తదితర వస్తువుల ద్వారా పంచాయతీలకు కొంత ఆదాయం లభిస్తుంది.

ప్ర : పంచాయతీ సెక్రటరీ గ్రేడ్ 5 ఉద్యోగుల వేతనాల సమస్యలపై మీ సమాధానం?

జ : పంచాయతీ సెక్రటరీల గ్రేడ్ 5 ఉద్యోగుల వేతనం సమస్య కొంతకాలం నుంచి నెలకొంది. ఈ సమస్య రెండు మూడు నెలల్లో పరిష్కారం కానుంది.

ప్ర : జిల్లావ్యాప్తంగా పంచాయతీల్లో ఏయే అభివృద్ధి పనులు చేపడుతున్నారు ? ఎంత నిధులు మంజూరు అయ్యాయి?

జ : శ్రీ సత్య సాయి జిల్లా వ్యాప్తంగా ఉన్న పంచాయతీలలో డ్రైనేజీ, సిమెంట్ రోడ్లు, గ్రామంలో తాగునీటి సమస్య, వీధిలైట్లు ఏర్పాటు రోడ్లు మరమ్మతులకు మొదటి ప్రాధాన్యతను ఇస్తున్నాం. కొత్త ప్రభుత్వం ఏర్పడినప్పటి నుండి పంచాయతీలకు 2024 -25 సంవత్సరానికి గాను 15వ ఆర్థిక నిధుల క్రింద జిల్లాకు రూ. 31.5 కోట్లు నిధులు ఆయా పంచాయతీల ఖాతాల్లోకి జమ కావడం జరిగింది. ఈ నిధుల ద్వారా పంచాయతీలలో అభివృద్ధి పనులను సక్రమంగా జరిగే విధంగా డిఎల్‌పిఒలకు, ఈవోఆర్డీలకు సూచనలు ఇచ్చాం.

ప్ర : జిల్లాలో సిబ్బంది కొరత పై మీ సమాధానం ?

జ : ఈవోఆర్డీలకు పంచాయతీ కార్యదర్శులకు ప్రమోషన్ల విషయంలో ఉన్నతాధికారుల నుండి త్వరలో ఉత్తర్వులు అందను న్నాయి. జిల్లా కేంద్రంలో సిబ్బంది కొరత ఉంది. డిపిఆర్‌సిలో నలుగురు ఆర్పీలు ఉండాలి. కానీ ఒక్కరే విధులు నిర్వహిస్తున్నారు. జడ్పీ కార్యాలయం నుండి ఇద్దరిని నియమించగా వారు ఇంకా ఇక్కడికి రాలేదు. వారు ఇక్కడికి వచ్చిన తర్వాత అన్ని పనులు సవ్యంగా సాగుతాయి. ఎలాంటి పనులకు ఆటంకం లేకుండా ఉన్న సిబ్బందితోనే సర్దుకువెళుతున్నాం. ఇటీవల కొత్తగా జిల్లా కేంద్రానికి నియామకాలు జరిగాయి. వారు త్వరలో విధులు చేపట్టనున్నారు.

శ్రీసత్యసాయి జిల్లా డిపిఒ సమత

ఉద్యోగాలు సాధించిన వారితో ఎంపి అంబికా లక్ష్మీనారాయణ

జాబ్‌మేళాలో 98 మందికి ఉద్యోగాలు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

అంబికా ఫౌండేషన్, అమరరాజా కంపెనీ ఆధ్వర్యంలో ఆదివారం నగరంలోని ఎంపి కార్యాలయంలో నిర్వహించిన జాబ్‌మేళాలో 98 మందికి ఉద్యోగాలకు ఎంపికైనట్లు ఎంపి అంబికా లక్ష్మీనారాయణ తెలిపారు. ఈ సందర్భంగా ఎంపి అంబికా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ జాబ్‌మేళాకు 145 మంది హాజరవగా 98 మందికి ఉద్యోగాలకు ఎంపికైనట్లు తెలిపారు. అమర రాజా కంపెనీ దేశంలో ప్రముఖ సంస్థల్లో ఒకటని, ఇలాంటి సంస్థల్లో ఉద్యోగం పొందడం చాలా గర్వకారణమన్నారు. ఈ మేళాలో పాల్గొన్న నిరుద్యోగులు తమ జీవితాలను మార్చుకోవాలని, కంపెనీలో కష్టపడి పనిచేస్తే మంచి అవకాశాలు లభిస్తాయని ఆయన తెలిపారు. నిరుద్యోగులను ఉద్యోగులుగా మారుస్తూ సహకరించడం తన ప్రాధాన్యత అన్నారు. అమర రాజా కంపెనీ ప్రతినిధి శ్రీ కళ్యాణ్ మాట్లాడుతూ ప్రొజెక్టర్ ద్వారా కంపెనీ చరిత్రను, అందులోని వివిధ విభాగాలను వివరించారు.

తెల్లవారుజామునే పోలీసు గస్తీ

ప్రజాశక్తి-అనంతపురం క్రైం

తెల్లవారుజామునే గస్తీ నిర్వహిస్తున్న పోలీసులు

ఇటీవల కాలంలో తెల్లవారుజామున చైన్ స్నాచింగ్‌లు అధికమైన నేపథ్యంలో అనంతపురం పోలీసులు కూడా సరికొత్త పంథా అనుసరిస్తున్నారు. ఇందులో భాగంగా ఆదివారం ఉదయం 5 గంటలకే పోలీసులు రోడ్లు, వీధుల్లోకి వచ్చి ఆటో మైక్ ద్వారా ప్రజలను అప్రమత్తం చేశారు. ముఖ్యంగా తెల్లవారుజామున ఒంటరిగా వాకింగ్‌కు వెళ్లే మహిళలు, ఇళ్ల ముందు ముగ్గులు వేస్తున్న మహిళలకు ఇంటింటికీ వెళ్లి అవగాహన కల్పించారు. యువకులు తమ ఆనవాళ్లు కనపడకుండా హెల్మెట్, మాస్కులు వేసుకుని అధిక వేగంతో వెళుతున్నా, అనుమానాస్పదంగా ఎక్కడైనా తిరుగుతుంటే వెంటనే డయల్ 100కు ఫోన్ చేయాలన్నారు. అవకాశం ఉంటే వారి ఫొటోలు, వీడియోలు తీసి పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. తెల్లవారుజామున కాలి నడక, రోజు వారి పనులకు వెళ్లే మహిళలు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

'అనంత'ను కలిసిన వైసిపి అనుబంధ సంఘాల అధ్యక్షులు

ప్రజాశక్తి-అనంతపురం రూరల్

అనంత వెంకటరామిరెడ్డితో వైసిపి అనుబంధ సంఘాల అధ్యక్షులు

నూతనంగా నియమితులైన వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అనుబంధ సంఘాల అధ్యక్షులు వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డిని ఆదివారం అనంతపురంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అనంత వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ నూతనంగా నియమితులైన అనుబంధ సంఘాల అధ్యక్షులు అందరినీ సమన్వయం చేసుకుని పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. రానున్న రోజుల్లో కూటమి ప్రభుత్వం చేపడుతున్న ప్రజావ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. అనంతను కలిసిన వారిలో యువజన విభాగం అధ్యక్షులు సాకే చంద్రశేఖర్, మహిళా విభాగం అధ్యక్షురాలు శ్రీదేవి, మైనార్టీ విభాగం అధ్యక్షులు మొఘల్ సైఫుల్లా బేగ్, ఆర్టీఐ విభాగం జిల్లా అధ్యక్షులు శ్రీనివాస్‌రెడ్డి, గ్రీవెన్స్ విభాగం జిల్లా అధ్యక్షులు బాకే హాబీబుల్లా, బూత్ కమిటీ విభాగం అధ్యక్షులు అమర్‌నాథ్‌రెడ్డి, ఇంటెలెక్చువల్ విభాగం అధ్యక్షులు రమేష్‌బాబు, విద్యార్థి విభాగం అధ్యక్షులు చంద్రశేఖర్‌యాదవ్, సోషల్ మీడియా అధ్యక్షులు నరేంద్రనాథ్‌రెడ్డి ఉన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన

ప్రజాశక్తి-రాయదుర్గం

రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న పోలీసులు

రోడ్డు భద్రత, ప్రమాదాల నివారణపై రాయదుర్గం పోలీస్ ఇన్స్‌పెక్టర్ జయనాయక్ ఆదివారం పట్టణంలో వాహన చోదకులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిమితికి మించి ప్యాసింజర్లను ఆటోల్లో తరలించకూడదన్నారు. ప్రతి ఒక్కరూ వాహనాల రికార్డులను ఉంచుకోవాలన్నారు. ఎవరైనా నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. కాగా బీటీ ప్రాజెక్టు రోడ్డు జాతీయ రహదారి సర్కిల్ వద్ద హెల్మెట్లు లేని ద్విచక్ర వాహనచోదకులను ఆపి వాహనం నడుపునప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ఉపయోగించాలన్నారు. ట్రాఫిక్ నిబంధనలను వివరించారు. హెల్మెట్లు లేనివారికి ఉచితంగా హెల్మెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ బాలరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

బండారు రవికుమార్‌కు సన్మానం

ఎమ్మెల్యే కుటుంబ సభ్యులను సన్మానిస్తున్న దండు శ్రీనివాసులు, టిడిపి నాయకులు

ప్రజాశక్తి-శింగనమల

ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ తండ్రి బండారు రవికుమార్ జన్మదినం సందర్భంగా తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి దండు శ్రీనివాసులు ఆదివారం అనంతపురంలోని ఎమ్మెల్యే స్వగృహంలో గజమాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు ఆకుల ఆంజనేయులు, మాజీ ఎంపిపి కదిరప్ప, జిల్లా తెలుగు యువత ప్రధాన కార్యదర్శి సుధాకర్‌యాదవ్, ఆకుల బాబు, మాజీ జడ్పిటిసి రామకృష్ణ, చల్లా నాగరాజు, మాజీ ఎంపిటిసి కుళ్లాయప్ప, నిదనవాడ చంద్రాయుడు, ఎంపిటిసి బయపరెడ్డి, దళిత సంఘాల నాయకులు చిన్న ఆంజనేయులు, యూనిట్ ఇన్‌ఛార్జి దండు ప్రకాష్, రంగస్వామి, నల్లప్ప, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన నీలూరు టిడిపి నేతలు

ప్రజాశక్తి-పామిడి

ఎమ్మెల్యేను సన్మానిస్తున్న పామిడి మండలం నీలూరు టిడిపి నాయకులు

ఎమ్మెల్యే గుమ్మనూర్ జయరామ్‌ను కర్నూలు జిల్లా ఆలూరులోని స్వగృహంలో పామిడి మండలం నీలూరు గ్రామానికి చెందిన టిడిపి నాయకులు ఆదివారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు పూలమాల వేసి సన్మానించారు. అనంతరం పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యంగా ఎస్సీ కాలనీలో సీసీ రోడ్డు, డ్రెయినేజీ సమస్యలు పరిష్కరించాలని విన్నవించారు. ఇందుకు స్పందించిన ఎమ్మెల్యే వెంటనే ఎంపిడిఒ తేజోష్ణతో ఫోన్ మాట్లాడి ఆయా సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఎమ్మెల్యేను కలిసిన వారితో నీలూరు టిడిపి నాయకులు బెల్లాల నారాయణరెడ్డి, జనార్దన్‌రెడ్డి, దేవేందర్‌రెడ్డి, ఓంకార్‌రెడ్డి, అసిత్తు, వీరయ్య, ఫీల్డ్ అసిస్టెంట్ వెంకటేష్, హరీష్, నారాయణ, సునీల్ పాల్గొన్నారు.

అన్నదానం చేస్తున్న నిత్యసురభి ట్రస్టు సభ్యులు

పేదలకు అన్నదానం

ప్రజాశక్తి-అనంతపురం

నిత్యసురభి ఛారిటబుల్ ట్రస్టు 'పుట్టినిల్లు' ఆశ్రమం ఆధ్వర్యంలో అనంతపురంలోని పెద్దాసుపత్రి, అంబేద్కర్ భవన్ వెనకవైపు ఉన్న గురుసదన్ ఆశ్రమంలో ఆదివారం అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ట్రస్టు ఛైర్‌పర్సన్ ఎస్.నిర్మలాకుమారి మాట్లాడుతూ చిన్నస్వామి నాయుడు వర్ధంతిని పురస్కరించుకుని ఆయన కూతురు, ట్రస్టు సభ్యురాలు ధనలక్ష్మి అన్నదానానికి సహకరించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు కవిన్ ఆదిత్య, సుబ్రమణ్యం, లక్ష్మీనారాయణ, మణిదీప్, తదితరులు పాల్గొన్నారు.

మహాసభలు జయప్రదం చేయండి

సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బి.శ్రీనివాసులు

ప్రజాశక్తి-గుంతకల్లు

విలేకరులతో మాట్లాడుతున్న బి.శ్రీనివాసులు

జిల్లా కేంద్రంలో నేటి నుంచి ప్రారంభం కానున్న సిపిఎం జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి.శ్రీనివాసులు పిలుపునిచ్చారు. ఈమేరకు ఆదివారం స్థానిక హంపి రెడ్డి భవనంలో ఏర్పాటు చేసిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 23, 24వ తేదీల్లో అనంతపురంలో నిర్వహించనున్న మహాసభలకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, రాష్ట్ర నాయకులు వై.వెంకటేశ్వరరావు, కె.ప్రభాకర్‌రెడ్డి పాల్గొననున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా గత మహాసభలో తీసుకున్న కర్తవ్యాల అమలు తీరును సమీక్షించుకుని.. రాబోయే మూడేళ్లలో ప్రజా సమస్యల పరిష్కారం కోసం భవిష్యత్తు ఉద్యమ ప్రణాళికను మహాసభల్లో రూపొందించనున్నట్లు తెలిపారు. గతంలో జరిగిన దేశ, రాష్ట్రవ్యాప్త పిలుపులు, జిల్లాలో ఉద్యోగ, ఉపాధ్యాయ కార్మిక వర్గాల, రైతు, వ్యవసాయ కూలీలు, కౌలు రైతులు, నిరుద్యోగ యువత, విద్యార్థి, సామాజిక సమస్యలు, మహిళా సమస్యల పరిష్కారం కోసం ఎన్నో చేపట్టినట్లు వివరించారు. 2021 నవంబర్‌లో జిల్లావ్యాప్తంగా నెల రోజులు పాదయాత్ర చేపట్టామన్నారు. అంతేగాకుండా రైతాంగ సమస్యలు, ఉపాధి పనులు కల్పించాలని, పెండింగ్ బిల్లుల చెల్లించాలని, వ్యవసాయ కార్మిక, కౌలు రైతుల సమస్యలపై బస్సు, జీపు, స్కూటర్ యాత్రలు చేశామన్నారు. జిల్లాలో సాగునీటి వనరుల అభివృద్ధి కోసం, వర్షం నీటిని నిల్వ చేయడానికి, ఆనకట్టలు, కాలువలు మరమ్మతుల కోసం బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని, హంద్రీనీవా, హెచ్.ఎల్.సి ఆధునీకరణ కోసం రూ.7వేల కోట్లు జిల్లాకు కేటాయించాలని, 2023 పంట నష్టపరిహారం, పంటల బీమా ఇవ్వాలని సత్యాగ్రహ, జలదీక్షలు, యాత్రలు చేపట్టామని గుర్తు చేశారు. అంగన్వాడీల సమ్మెకు 42 రోజులపాటు మద్దతు ఇచ్చి ప్రత్యక్షంగా పాల్గొన్నామన్నారు. విద్యార్థుల సమస్యల పరిష్కారానికి సెంట్రల్ యూనివర్సిటీకి బడ్జెట్‌లో నిధులు కేటాయించడంతోపాటు సొంత భవన నిర్మాణాలను పూర్తి చేసి, తరగతులు ప్రారంభించాలని జరిగిన పోరాటాల్లో పాల్గొన్నామన్నారు. జిల్లావ్యాప్తంగా సామాజిక సమస్యలు, శ్మశానాల స్థలాలు, పేదల ఇంటి స్థలాలు, మహిళలపై అత్యాచారాలు, దాడులకు నిరసనగా పాదయాత్రలు చేశామన్నారు. వీటితోపాటు అనేక పోరాటాలు చేశామన్నారు. భవిష్యత్తులో కూడా ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజల తరపున పోరాటం చేసేందుకు భవిష్యత్తు ఉద్యమ కార్యాచరణ రూపొందించుకోవడానికి జరిగే మహాసభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మహాసభల్లో ప్రజలందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో సిపిఎం పట్టణ కార్యదర్శి మారుతీప్రసాద్, పట్టణ వర్గ సభ్యులు జగ్గలి రమేష్, కసాపురం రమేష్, సాకే నాగరాజు, సురేంద్ర, పట్టణ కమిటీ సభ్యులు జగదీష్, షబ్బీర్, వీరన్న, తదితరులు పాల్గొన్నారు.

పామిడి : జిల్లాకేంద్రంలో నిర్వహించనున్న సిపిఎం జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని ఆ పార్టీ సీనియర్ నాయకులు అనిమిరెడ్డి, మండల కార్యదర్శి మల్లేష్ ఆదివారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. మహాసభలకు సిపిఎం రాష్టట కార్యదర్శి శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వెంకటేశ్వరరావు హాజరు కానున్నట్లు తెలిపారు. కావున మండల నుంచి పెద్దఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

ఆల్‌మేవా నాయకుల డిమాండ్

ప్రజాశక్తి-అనంతపురం

విలేకరులతో మాట్లాడుతున్న ఆల్ మేవా నాయకులు

రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ శాఖల్లో పని చేస్తున్న ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఆల్ మైనార్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ (ఆల్ మేవా) జిల్లా నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం నగరంలోని 5వ రోడ్డులో ఉన్న ఆల్ మేవా కార్యాలయంలో జిల్లా స్క్రీనింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఇందులో భాగంగా జిల్లాలో ఆల్‌మేవా సంఘాన్ని బలోపేతం చేసేందుకు ప్రణాళికపై చర్చించారు. ఈ సందర్భంగా ఆల్‌మేవా నాయకులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఉద్యోగులకు సంబంధించి ఆమోదయోగ్యమైన పిఆర్‌సి, పెండింగ్ డిఎలు, సరెండర్ లీవులు, జిపిఎఫ్ రుణాల మంజూరు, మెడికల్ రీయింబర్స్‌మెంట్ బిల్లులు, మృతిచెందిన పెన్షనర్ల దహన సంస్కారాల బిల్లులు, క్యాష్‌లెస్ ట్రీట్‌మెంట్, ప్రయివేట్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో ఇహెచ్‌ఎస్ కార్డులపై ఉచిత వైద్యసేవల కోసం ఉత్తర్వుల జారీ చర్యలు, సిపిఎస్‌ను రద్దు చేసి ఒపిఎస్‌ను పునరుద్ధించాలని, సొంతిల్లు లేని ప్రభుత్వ ఉద్యోగులకు రాయితీపై వారు పని చేసే చోట్ల ఇలా సముదాయాల ను నిర్మించుటకు చర్యలు తీసుకోవాలని, ఉద్యోగులుగా పదవీ విరమణ చేసిన వారికి గ్రాట్యుటీ, తదితర సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఇకపోతే కేంద్ర ప్రభుత్వ నియామకాలు, ముస్లిములకు ఒబిసి రిజర్వేషన్లు అమలు చేయాలన్నారు. రాష్ట్రంలో 'పిఎంజెవికె' పథకం ద్వారా కేటాయించిన భవన సముదాయాలను త్వరితగతిన పూర్తి చేసి మైనారిటీలకు అప్పగించాలని, రాష్ట్రంలో ఉర్దూ కళాశాలల్లో పని చేస్తున్న గెస్ట్ లెక్చరర్లను కాంట్రాక్ట్ లెక్చరర్లుగా మార్చి ఆర్థికస్థితిని మెరుగుపరచాలన్నారు. వీటితోపాటు అనేక సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర మేవా సహాధ్యక్షులు వై.ఫక్రుద్దీన్, జిల్లా అధ్యక్షులు షేక్షావలి, ప్రధాన కార్యదర్శి ఫారూక్ మహమ్మద్, ఉపాధ్యక్షులు అష్రఫ్‌అలీ, మహబూబ్ బాషా, జిలాన్, దౌలా, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గణిత దినోత్సవం

ప్రజాశక్తి-అనంతపురం

సాయివిజ్ఞాన్ పాఠశాలలో విద్యార్థిని తయారు చేసిన నమూనాను పరిశీలిస్తున్న దృశ్యం

నగరంలోని 3వరోడ్డులో ఉన్న సాయివిజ్ఞాన్ పాఠశాలలో గణితశాస్త్ర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా శ్రీనివాస రామానుజన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా విద్యార్థుల వేషధారణలో అలరించారు. తర్వాత క్విజ్, ప్రాజెక్టుల విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు ఎంపి శ్రీనివాసులు, సి.కరుణాకర్‌బాబు, పాఠశాల ప్రిన్సిపాల్ జి.లావణ్యరామ్, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అలాగే ఎస్వీ డిగ్రీ, పీజీ కళాశాలలో గణిత మేధావి శ్రీనివాస రామానుజన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎస్వి కళాశాలల వైస్‌ఛైర్మన్ సి.చక్రధర్‌రెడ్డి మాట్లాడుతూ గణిత మేధావి అయిన శ్రీనివాస రామానుజన్ జయంతిని పురస్కరించుకుని జాతీయ గణిత దినోత్సవాన్ని నిర్వహించుకుంటున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎన్ఎవి.ప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ టి.శ్రీనివాసులు, ఎఒ శ్రీనాథ్, గణిత విభాగ అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

గుత్తి : గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ జయంతిని పురస్కరించుకుని ఆదివారం గుత్తిలో ఏపి పెన్షనర్ల భవనంలో చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పెన్షనర్ల సంఘం తాలూకా అదనపు కార్యదర్శి జెన్నే కుళ్లాయిబాబు, పెన్షనర్ల సంఘం నాయకులు వెంకటసుబ్బమ్మ, ఫక్రుద్దీన్, నారాయణరెడ్డి, చెన్నారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

యాడికి : మండల పరిధిలోని కమలపాడు గ్రామంలో ఉన్న విజన్ విద్యాసంస్థల్లో గణితశాస్త్ర పితామహుడు శ్రీనివాస రామానుజన్ జయంతిని పురస్కరించుకుని ఆదివారం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఇందులో భాగంగా విద్యార్థులు ఏర్పాటు చేసిన ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. అదేవిధంగా డిసెంబర్ 23న జాతీయ రైతు దినోత్సవాన్ని పురస్కరించుకుని రైతులు పడే కష్టాన్ని విద్యార్థులు నాటిక రూపంలో వివరించారు. ఈ కార్యక్రమంలో విజన్ స్కూల్ కరస్పాండెంట్ విశ్వనాథ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అలాగే మండల కేంద్రంలోని స్టార్ పారడైజ్ హైస్కూల్లో గణితశాస్త్ర పితామహుడు శ్రీనివాస రామానుజన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల మేనేజ్‌మెంట్ నాగేంద్ర, ఉపాధ్యాయులు శశినేత్ర, తహరున్, విద్యార్థులు పాల్గొన్నారు.

జాతరలో పాల్గొన్న ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ

ఘనంగా నల్లమ్మ జాతర

ప్రజాశక్తి-శింగనమల

మండల పరిధిలోని కల్లుమడి గ్రామంలో ఆదివారం నల్లమ్మ జాతర ఘనంగా జరిగింది. ఇందులో భాగంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ అమ్మవారికి పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ గుత్తా ఆదినారాయణ, నాయకులు దండు శ్రీనివాసులు, అమ్మలదిన్నె శాలిని, డీలర్ కంబగిరి, ఆయకట్టు ఛైర్మన్ ఓబుళరాజు, బాలరంగయ్య, డైరెక్టర్ మల్లికార్జున, సుదర్శన్, శంకర్, సురేష్, జయరామ్, వెంకటేష్, మధు, బాబు, రామాంజినేయులు, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి 'మీ ఇంటికి మీ ఎమ్మెల్యే'

ప్రజాశక్తి-అనంతపురం రూరల్

నేటి నుంచి మీ ఇంటికి మీ ఎమ్మెల్యే కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం నగరంలోని శారదా నగర్, మంగళవారం బుడ్డప్పనగర్‌లో పర్యటించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకోనున్నట్లు తెలిపారు.

గుత్తి కోటను సందర్శించిన న్యాయమూర్తి

ప్రజాశక్తి-గుత్తి

మన్రో సమాధిని తిలకిస్తున్న జడ్జి కాశీవిశ్వనాథ ఆచారి

చారిత్రాత్మక గుత్తి కోటను సీనియర్ సివిల్ జడ్జి కాశీ విశ్వనాథ ఆచారి ఆదివారం సందర్శించారు. ఇందులో భాగంగా ముందుగా జిల్లా మొట్ట మొదటి కలెక్టర్ సర్ థామస్ మన్రో సమాధిని సందర్శించారు. అనంతరం కోటలో ఉన్న దర్గా, గుర్రపు శాలలతోపాటు వివిధ కట్టడాలను వీక్షించారు. కార్యక్రమంలో గుత్తి కోట సంరక్షణ సమితి అధ్యక్షుడు సి.విజయభాస్కర్, నాయకులు బాబాసాహెబ్, హెచ్.ఎం.జిలాన్, కోట గైడ్ ఎం.రమేష్, పురావస్తు శాఖ సిబ్బంది ఆంజనేయులు, శ్రీరాములు, పర్వీన్ బేగం, తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-పెద్దవడుగూరు

మండల కేంద్రంలోని ఐఎన్‌సి చర్చిలో ఆదివారం నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పాస్టర్ జాన్ డేవిడ్, సంఘ పెద్దలు ఆనంద్‌కుమార్, శోభారాణి, ఇమ్మానుయేలు, మోపు, శారమ్మ, ఏస్తేరురాణి, లక్ష్మన్న, గిర్రప్ప, సాల్మన్, మనోజ్, తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న పాస్టర్లు, క్రైస్తవులు

నేడు 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'

అనంతపురం కలెక్టరేట్ : కలెక్టరేట్ రెవెన్యూ భవన్‌లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ శివ్‌నారాయణ్ శర్మ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకూ ప్రజల నుంచి వినతులను స్వీకరించనున్నట్లు తెలిపారు. కావున జిల్లాలోని ప్రజలు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మంత్రి కొల్లు రవీంద్రను కలిసిన టిడిపి నాయకులు

అనంతపురం కలెక్టరేట్ : రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్రను టిడిపి బిసి సెల్ రాష్ట్ర నాయకులు కుళ్లాయప్ప మచిలీపట్నంలో ఆదివారం కలిశారు. ఇందులో భాగంగా మంత్రి కొల్లు రవీంద్ర అన్న కొల్లు వెంకటరమణ సమస్మరణ సభలో పాల్గొని నివాళి అర్పించారు. అనంతరం మంత్రి కొల్లు రవీంద్ర, కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం అక్కడే ఉన్న ఆర్‌టిసి ఛైర్మన్ కొనకొండ్ల నారాయణను మర్యాద పూర్వకంగా కలిశారు.

నేడు యాడికి కాలువకు నీరు విడుదల

యాడికి : యాడికి కాలువకు సోమవారం నీరు విడుదల చేయనున్నట్లు టిడిపి మండల కన్వీనర్ గొర్తి రుద్రమనాయుడు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే జెసి అస్మిత్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై గంగపూజ చేసి నీరు విడుదల చేయనున్నట్లు తెలిపారు.

రబీ పంటల బీమా ప్రీమియం చెల్లించండి

శింగనమల : మండల వ్యాప్తంగా రబీలో పంటలు సాగు చేసిన రైతులు ఈనెల 31వతేదీలోపు బీమా ప్రీమియం చెల్లించుకోవాలని మండల వ్యవసాయ శాఖ అధికారి అన్వేష్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పూర్తి వివరాలకు రైతు సేవా కేంద్రం సిబ్బందిని సంప్రదించాలని కోరారు.

అనాథలకు అన్నదానం

ఉరవకొండ : క్రిస్మస్ పండుగను పురస్కరించుకుని ఆదివారం పట్టణంలోని అనాథ వృద్ధాశ్రమంలో మాల మహానాడు రాష్ట్ర ఉపాధ్యక్షులు మొలక బాల రామాంజనేయులు ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సిఐ మహానంది మాట్లాడుతూ స్వచ్ఛంద సంస్థలు, ప్రజా, కుల సంఘాలు అనాథ వృద్ధులకు సహాయ సహకారాలు అందించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌పిఎస్ నాయకులు రాజు, ఓబయ్య, యల్లన్న, మల్లికార్జున, తదితరులు పాల్గొన్నారు.

వైసిపి పిఆర్ విభాగం జిల్లా అధ్యక్షులుగా బి.యోగేంద్రరెడ్డి

ఉరవకొండ : వైసిపి పంచాయతీరాజ్ విభాగం జిల్లా అధ్యక్షులుగా ఉరవకొండ మండలం నెరమెట్ల సర్పంచి బి.యోగేందర్‌రెడ్డి నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనపై ఎంతో నమ్మకంతో పంచాయతీరాజ్ విభాగం జిల్లా అధ్యక్షులుగా నియమించిన అధ్యక్షు జగన్, సహకరించిన ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

గుండెపోటుతో వైసిపి సీనియర్ నేత మృతి

కుందుర్పి : వైసిపి సీనియర్ నేత బి.టి రామదాసు(60) గుండెపోటుతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న మాజీ ఎంపి తలారి రంగయ్య ఆదివారం అనంతపురంలోని ఓ ప్రయివేటు ఆసుపత్రికి చేరుకుని మృతదేహానికి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. కుటుంబానికి ఎల్లవేళలా వైసిపి అండగా ఉంటుందన్నారు.

చీరలు పంపిణీ

అనంతపురం రూరల్ : శారదా జయంతిని పురస్కరించుకుని ఆదివారం నగరంలోని హెచ్చెల్సీ కాలనీలో రామకృష్ణ సేవాసమితి ఆధ్వర్యంలో మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎంపి అంబికా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ రామకృష్ణ సేవాసమితి సభ్యుల కృషి ఆదర్శనీయమన్నారు. ఇలాంటి కార్యక్రమాలు చేయడం ద్వారా సహకారం, సహాయ భావనను పెంపొందిస్తాయన్నారు.

మిత్రుని కుటుంబానికి ఆర్థికసాయం

తాడిపత్రి : ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన మిత్రుడి కుటుంబానికి స్నేహితులు ఆర్థికసాయం అందజేశారు. పట్టణానికి చెందిన రాఘవేంద్ర ఓ ప్రయివేటు పాఠశాలలో పని చేస్తూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. ఇతనికి ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. ఈనేపథ్యంలో ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో రాఘవేంద్ర మరణించాడు. విషయం తెలుసుకున్న పూర్వపు విద్యార్థులు ఆదివారం తమ గురువు కె.గురుమోహన్ ఆధ్వర్యంలో రాఘవేంద్ర ఇంటికి చేరుకుని భార్యకు రూ.82వేల ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో కామర్స్ లెక్చరర్ గురుమోహన్, మిత్రులు వెంకటేశ్వరరెడ్డి, శ్రీనివాసులు, సురేష్, శంకర్, గురుప్రసాద్, శ్రీనాథ్‌గౌడ్, కోమలి శ్రీను, బాలగంగాధర్, శ్రీకాంత్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

'వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చొద్దు'

బెలుగుప్ప : ఆర్థికంగా, సామజికంగా అన్నిరంగాల్లో అభివృద్ధి చెందిన వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేరిస్తే ఇప్పటికే వెనుకబడిన గిరిజనులు తీవ్రంగా నష్టపోతారని హరిత దివ్యాంగుల సేవాసమితి రాష్ట్ర అధ్యక్షులు బి.మోహన్‌నాయక్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని ఎస్టీ, ఎస్సీ, బిసి, హాస్టల్ ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గిరిజనులు ఇప్పటికీ అడవుల్లో నివసిస్తున్నారన్నారు. దీంతో విద్య, ఉద్యోగాలు, ఉపాధి లేక తీవ్ర దరిద్రంలో బతుకుతున్నారన్నారు. అంతేగాకుండా అంటరానితనం ఎదుర్కొంటున్నారన్నారు. ప్రస్తుతం ఉన్న రిజర్వేషన్ల కారణంగా గిరిజనుల్లో ఒకరో.. ఇద్దరో ఉద్యోగాలు సాధిస్తున్నారన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో వాల్మీకులను ఎస్టీ జాబితాలో కలిపితే గిరిజనులు తీవ్రంగా నష్టపోతారన్నారు. కావున కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు వాల్మీకులను ఎస్టీ జాబితాల్లోకి చేర్చాలనే ప్రయత్నాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో రమణ, భాస్కర్, అంజి, ధరణికుమార్, రాజశేఖర్‌నాయక్, మల్లి, వెంకీనాయక్, బాబు, రామునాయుడు, అంజిత్, శ్రీనివాస్‌నాయక్, తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

వ్యక్తి అనుమానాస్పద మృతి

మృతిచెందిన విజయ్

బుక్కరాయసముద్రం : మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయం పక్కన ఉన్న వంకలో బుక్కరాయసముద్రానికి చెందిన విజయ్(32) అనుమానాస్పద స్థితిలో ఆదివారం మృతిచెందాడు. కాలువలో మృతదేహం ఉండటాన్ని గమనించిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు వచ్చి మృతదేహాన్ని వెలికితీసి పరిశీలించగా విజయ్‌గా గుర్తించి బంధువులకు సమాచారం అందించారు. మృతుడికి భార్య అంకే లింగమ్మ, ఇద్దరు కుమారులు, ఒక కూతురు ఉన్నారు. మృతికి కారణాలు తెలియాల్సి ఉంది. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పోలీసులు అనంతపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

యువకుడు ఆత్మహత్యాయత్నం

గుత్తి : మండలంలోని మాముడూరు గ్రామానికి చెందిన ఓ యువకుడు ఆదివారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గ్రామానికి చెందిన అనిల్‌కుమార్ విష గుళికలు మింగి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం అతన్ని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్స కోసం అతడిని అనంతపురం ఆస్పత్రికి తీసుకెళ్లారు.

కరివేపాకుపై గడ్డిమందు పిచికారి

పోలీసులకు ఫిర్యాదు

పుట్లూరు : మండలంలోని చింతకుంట గ్రామంలో రైతు భైరవేశ్వర సాగు చేసిన కరివేపాకు పంటకు గుర్తు తెలియని వ్యక్తులు గడ్డి మందును పిచికారీ చేశారు. దీంతో బాధిత రైతు మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. వెంటనే స్పందించిన ఎస్ఐ హేమాద్రి పొలానికి చేరుకుని పరిశీలించారు. కరివేపాకు పంటకు గడ్డి మందు పిచికారి చేయడాన్ని గమనించి హార్టికల్చర్ అధికారులకు సమాచారం అందజేశారు. వారు సోమవారం పొలానికి వచ్చి పరిశీలించనున్నట్లు ఎస్ఐ తెలిపారు.